క్లుప్తంగా

హాస్టళ్ల విలీనం విరమించుకోవాలి

టేకులపల్లి: హాస్టళ్ల క్రమబద్ధీకరణ పేరుతో రాష్ట్రంలో 50 మంది కంటే తక్కువ విద్యార్థులు ఉన్న హాస్టళ్లను దగ్గరలోని హాస్టల్స్‌లో విలీనం లేదా పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లుగా మార్చే ప్రభుత్వ ఆలోచనను వెంటనే విరమించుకోవాలని ఎస్ఎఫ్ఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు గార్లపాటి పవన్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పేద విద్యార్థులు ప్రధానంగా గ్రామీణ, ఆదివాసీ, దళిత విద్యార్థుల విద్యాభివృద్ధికి పట్టుగొమ్మలుగా హాస్టళ్లు ఉన్నాయన్నారు. విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు, మెస్, కాస్మోటిక్ చార్జీలను ప్రభుత్వం పెంచకుండా, నిధులు ఇవ్వకుండా వాటిని నిర్వీర్యం చేసే ప్రయత్నం దారుణమన్నారు. తక్షణమే నిధులు మంజూరు చేసి హాస్టళ్లలో సదుపాయాలు కల్పించాలని, లేకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

రోజు విడిచి రోజు ‘భగీరథ’ నీటి సరఫరా

టేకులపల్లి: మండలంలోని గ్రామాలకు మిషన్ భగీరథ నీరు రోజు విడిచి రోజు సరఫరా చేయడం జరుగుతుందని మిషన్ భగీరథ గ్రిడ్ టేకులపల్లి మండల ఏఈ రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అశ్వాపురం మండలం కుమ్మరిగూడెం దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద గల మిషన్ భగీరథ పంప్‌హౌజ్‌లో గోదావరి వరదల ప్రవాహం కారణంగా ఇసుక, సిల్ట్ కొద్ది కొద్దిగా పంప్ హౌజ్ లో పేరుకుపోవడం వలన పంపింగ్‌కు తరచుగా అంతరాయం ఏర్పడుతోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే ఈనెల 13 నుంచి 29 వరకు పూడిక తీసే కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. గ్రామాల్లోని ప్రజలు ముందస్తుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని, ప్రకటించిన తేదీల్లో మార్పులు, చేర్పులు కూడా జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు.

ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ప్రకాశ్

పాల్వంచ: కొత్తగూడెంకు చెందిన క్రీడాకారిణి మాలోతు ఇందు ఇటీవల రాష్ట్ర స్థాయి రన్నింగ్ పోటీల్లో బంగారుపతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ మేరకు మూడు రోజుల పాటు జరిగే పోటీలకు హాజరుకానుండగా ప్రయాణ ఖర్చుల నిమిత్తం వర్తక సంఘం కన్వీనర్ చలువాది ప్రకాశ్ మంగళవారం రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో కోచ్ నరేశ్, ఆర్యవైశ్య మహాసభ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చలవాది రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాంసం విషయంలో గొడవ

పాల్వంచరూరల్: హోలీ సందర్భంగా మాంసం పంపకం విషయంలో మంగళవారం ఇద్దరి మధ్య గొడవ జరిగింది. మండలంలోని బోజ్యాతండాలో హోలీ సందర్భంగా మేకపోతును కోసి పోగులు వేసుకున్నారు. అక్కడ భూక్యా ఉపేందర్, లూనావత్ బాబు మధ్య గొడవ జరగగా, ఉపేందర్ తన పెదవి కొరికి దూషించాడని బాబు ఫిర్యాదు చేశాడు. అలాగే, తనపై బాబు దాడి చేశాడని ఉపేందర్ ఫిర్యాదు చేయడంతో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

పరపతి సంఘం రాష్ట్ర డైరెక్టర్‌గా వినయలత



వినయలతను అభినందిస్తున్న చైర్మన్ లలిత

ఇల్లెందు: మున్నూరుకాపు మహిళా పరపతి సంఘం(మహిళా బ్యాంకు) రాష్ట్ర డైరెక్టర్‌గా ఇల్లెందుకు చెందిన మిర్యాల వినయలత పటేల్‌ను నియమించారు. మంగళవారం కార్యనిర్వహణాధికారి పి.పురుషోత్తమరావు ప్రకటించారు. హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర చైర్మన్ ఆకుల లలిత చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నట్లు వినయలత పటేల్ తెలిపారు.

నేడు మహిళా దినోత్సవ వేడుకలు

పాల్వంచరూరల్: స్థానిక పాత ఆర్డీఓ కార్యాలయంలో నేడు అంతర్జాతీయ మహిళాదినోత్సవ వేడుకలను నిర్వహించడం జరుగుతుందని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని మహిళలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

తరాలుగా వీడని నిర్లక్ష్యం

70 ఏళ్లుగా రేకుల షెడ్డే గిరిజన బడి..!

- విద్యార్థుల పాలిట శాపం
- దయనీయంగా ఎస్టీ బాలుర వసతి గృహం, ఆశ్రమ పాఠశాల

ఇల్లెందు: పట్టణ నడిబొడ్డులోని ఒక రేకుల షెడ్డులో గిరిజన బాలుర హాస్టల్ ఉంది. ఈ హాస్టల్‌లోనే సగం ఆశ్రమ పాఠశాల కూడా ఏర్పాటు చేశారు. కానీ అందుకు తగిన సదుపాయాలు కల్పించడం మరిచిపోయారు. పాలకుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా 70 ఏళ్లుగా గిరిజన విద్యార్థులు ఇక్కడి షెడ్డులో మగ్గుతున్నారు. రేకుల షెడ్డులో కొంత మందితో ఆశ్రమ పాఠశాల, మరి కొంతమందితో హాస్టల్ సాగుతోంది. ఒకే ఒక్క బోరు, రెండు మున్సిపాల్టీ ట్యాప్‌లు, పది లోపు మరుగు దొడ్లు, స్నానపు గదులు ఉన్నాయి. ఆట వస్తువులు ఏర్పాటు చేశారు కానీ దాని మెంటినెన్స్ పట్టించుకోవటం లేదు. ప్రస్తుతం ఈ విద్యా సంవత్సరంలో మొత్తం 131 మంది విద్యార్థులు ఉన్నారు. వీరందరికీ ఒకే ఒక్క చేతి పంపుతో నీరు అందుతోంది. మరో రెండు మున్సిపల్ నల్లాలు ఉన్నా రెండు రోజులకోసారి నీరు విడుదల చేస్తున్నారు. ఏళ్లుగా విద్యార్థులు పాలకుల నిర్లక్ష్యానికి బలైపోతున్నారు.

తప్పని తిప్పలు..

స్వాతంత్ర్యం వచ్చిన ఆరేళ్ల తరువాత గిరిజన బాలుర హాస్టల్ ఏర్పాటు కోసం రేకుల షెడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ రేకుల షెడ్డు నిర్మాణం చేసి 70 ఏళ్లు కావస్తోంది. శిథిలావస్థకు చేరిన ఈ రేకుల షెడ్డులో కనీసం 60 వరకు టెన్త్‌బ్యాచ్‌లు విద్యనభ్యసించాయి. నేటికీ ఈ రేకుల షెడ్డులోనే ఎస్టీ బాలుర హాస్టల్, ఆశ్రమ పాఠశాలను కొనసాగుతోంది. 1953 డిశంబర్ 13న నాటి సోషల్ వెల్ఫేర్ మినిష్టర్ శంకర్ దేవ్ శంకుస్థాపన చేశారు. 1955లో ఈ రేకులషెడ్డులో హస్టల్‌ను ప్రారంభించారు. అప్పటి నుంచి విద్యార్థులు ఎండ, వర్షం, చలి, చీకటితో తిప్పలు పడుతున్నారు.

మరుగుదొడ్లు అంతంత మాత్రమే..

ఈ రేకుల షెడ్డులో ఒక హాల్, ఒక గది, వరండా ఉంది. విద్యార్థులు ఇక్కడే చదువుకోవటం, ఇక్కడే భోజనం చేయటం, ఇక్కడే నిద్రించటంతో వీరి సమస్యలు మాత్రం వర్ణనాతీతంగా ఉన్నాయి. స్నానపు గదులు, మరుగుదొడ్లు సక్రమంగా లేక ఆరుబయటే స్నానాలు చేస్తారు. ఆహ్లాదం, ఆనందం ఈ విద్యార్థులకు అందనంత దూరంలో ఉంది.



శిథిలావస్థకు చేరిన గిరిజన బాలుర వసతి గృహం



నిర్మాణంలో నిలిచిపోయిన మరుగుదొడ్లు



హాల్‌లో సాగుతున్న బోధన

ప్రస్తుత పరిస్థితి..

3వ తరగతిలో ప్రవేశం పొందిన విద్యార్థులు ఇదే పాఠశాలలో 7వ తరగతి వరకు చదువుకునే అవకాశం ఉంది. ఇక 8, 9, 10 తరగతుల విద్యార్థులు మాత్రం పట్టణంలోని హైస్కూల్స్‌కు వెళ్లాల్సిందే. ఇక్కడ సదుపాయలు లేవని ఆశ్రమ పాఠశాలను అప్‌గ్రేడ్ చేయటం లేదు. అప్‌గ్రేడ్ చేస్తే సదుపాయాలు లభించే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం మొత్తం ఇందులో 131 మంది విద్యనభ్యసిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రత్యేక భవనాలు, మౌలిక సదుపాయాలు కల్పించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది కోరుతున్నారు.

పక్కా భవనం కావాలి



రేకుల షెడ్డులో ఎండాకాలం వేడిగా చలి కాలం చలిగా ఉంటుంది. ఇక వర్షాకాలం కురుస్తోంది. ఏ కాలం వచ్చినా ఈ రేకుల షెడ్డు ఇబ్బందిగా ఉంది. ఒకే ఒక్క చేతి పంపు, రెండు నల్లాలు వచ్చినప్పుడు స్నానాలు, బట్టలు ఉతుక్కుటున్నాం. ఒక్కటే హాల్ కావటం వల్ల ఒకవైపు ఒక తరగతి, మరొక వైపు మరో తరగతి సాగుతుంది. ఆ సమయంలో ఎవరైనా హాస్టల్ పిల్లలు వస్తే ఓ చిన్న గదిలో ఉండాల్సిందే.

– బి. రాంచరణ్, 7వ తరగతి విద్యార్థి

ఒకటే షెడ్డులో హాస్టల్, పాఠశాల..



ఏళ్లుగా ఈ రేకుల షెడ్డులో హాస్టల్ ఉండేది. ఐదారేళ్ల క్రితం సగ భాగం ఆశ్రమ పాఠశాలగా మార్చి వేశారు. ఆశ్రమ పాఠశాలగా మార్చి ఒకే చోట హాస్టల్, ఆశ్రమ పాఠశాల నడపటం వల్ల తరగతులు సాగటం కష్టంగా ఉంది. ప్రభుత్వం పక్కా భవనం నిర్మించినట్లయితే సమస్యలు తీరే అవకాశం ఉంది. ఎన్నో ఏళ్లగా ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్తున్నా పక్కా భవనం మాత్రం మంజూరు కావటం లేదు..

– భరత్, ఎస్టీ హాస్టల్ సంక్షేమ అధికారి, ఇల్లెందు

ఇల్లెందు ఏజెన్సీకి అన్యాయం

ఇల్లెందురూరల్: ప్రభుత్వ వివక్ష వల్లే ఇల్లెందు ఏజెన్సీకి తీరని అన్యాయం జరుగుతోందని సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీరపాషా, న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు, టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్ అన్నారు. కొమరారం, బోడు మండలాలుగా, ఇల్లెందును రెవిన్యూ డివిజన్‌గా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర మంగళవారం నాల్గవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కొమరారం గ్రామంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వారు ప్రసంగించారు. ప్రజల ఆకాంక్ష బలంగా ఉన్న ఆయా ప్రాంతాలలో అందుకు అనుగుణంగా వనరులు కూడా పుష్కలంగా ఉన్నాయని గుర్తుచేశారు. ప్రభుత్వం స్పందించి ప్రజల ఆకాంక్షను నెరవేర్చే వరకు ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. వాంకుడోత్ మోతీలాల్ అధ్యక్షతన నిర్వహించిన సభలో న్యూడెమోక్రసీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బండారు అయిలయ్య, గుండాల ఎంపీపీ ముక్తి సత్యం, లక్ష్మీదేవిపల్లి జెడ్పీటీసీ మేరెడ్డి వసంత, కోరం లక్ష్మి, సర్పంచ్‌లు బానోత్ సంతు, మోకాళ్ల కృష్ణ, రజిత, సరోజిని, తాటి చుక్కమ్మ, ఎంపీటీసీలు పూనెం సురేందర్, పాయం కృష్ణప్రసాద్, తాటి యశోద, ఈసాల పాపమ్మ, ఉపసర్పంచ్ తాటి రాంబాబు, వివిధ రాజకీయ పక్షాల నాయకులు సారయ్య, యదల్లపల్లి సత్యం, తుపాకుల నాగేశ్వరరావు, ముక్తి కృష్ణ, తాటి బిక్షం, చింత ఉదయ్, జోగ కాంతారావు, ఎట్టి నర్సింహారావు, పాడుగు నర్సింహారావు, మూడు మాలు, జోగ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు

అటెన్షన్ ప్లీజ్

శిథిల భవనంలో అంగన్‌వాడీ..



టేకులపల్లి మండలం సులానగర్ ఎంపీపీఎస్ పాఠశాల ఆవరణలోని ఓ శిథిల భవనంలో అంగన్‌వాడీ కేంద్రం కొనసాగుతోంది. కేంద్రం పరిధిలో పది మంది చిన్నారులు, ఇద్దరు గర్భిణులు, నలుగురు బాలింతలు ఉన్నారు. పాత భవనం కావడంతో వర్షం వస్తే లోపల గదిలో కురుస్తుంది. దీంతో సామగ్రి భద్రపర్చడం ఇబ్బందిగా మారింది. ఉన్నతాధికారులు స్పందించి భవనానికి మరమ్మతులు కాని నూతన భవనం మంజూరు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

– టేకులపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి : కె.ఎం.తార, సీడీపీఓ, టేకులపల్లి ప్రాజెక్టు
సెల్ నంబర్ : 9490002168

వైభవంగా స్వామివారి కల్యాణం



ఇల్లెందురూరల్: తాళి బొట్టు చూపిస్తున్న అర్చకుడు

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం, నాయకులగూడెం గ్రామాల్లో రాధాకృష్ణుల కల్యాణ మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రతీ ఏటా హోలీ పర్వదినం రోజున రాధాకృష్ణుల కల్యాణం నిర్వహించడం ఆయా గ్రామాలలో దశాబ్దాలుగా ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా ఊరేగింపుగా రాధాకృష్ణుల ఉత్సవ విగ్రహాలను కల్యాణపండపం వద్దకు తీసుకొచ్చి వేద పండితులు జిల్లోజు రామాచార్యులు, రవికుమార్, కోటేశ్వరరావు తదితరులు శాస్త్రోక్తంగా వేదమంత్రోచ్చారణలతో రాధాకృష్ణుల కల్యాణాన్ని నిర్వహించారు. కల్యాణం అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.



సుజాతనగర్: చెన్నకేశవ స్వామి వారి కల్యాణం

చెన్నకేశవస్వామి కల్యాణం..

సుజాతనగర్: శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి కల్యాణాన్ని స్థానిక చెన్నకేశవస్వామి ఆలయంలో కనుల పండువగా మంగళవారం నిర్వహించారు. కల్యాణ మండపంపై ప్రత్యేక అలంకరణతో కొలువు దీరిన స్వామివార్లకు వేదపండితులు కంజర్ల సత్యనారాయణ చారి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. గుడిబండ వెంకట కమల, మనోహర్‌రావు కుటుంబ సభ్యులు వారి ఇంటి వద్ద నుంచి మేళతాళాల నడుమ ముత్యాల తలంబ్రాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చి అర్చకులు అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

గోటి తలంబ్రాలతో పయనం

జూలూరుపాడు: జూలూరుపాడు మండలం కాకర్ల గ్రామం నుంచి భద్రాచలం శ్రీరాముని సన్నిధానంలో గోటితలంబ్రాలు సమర్పించేందుకు భక్తులు మంగళవారం పయనమయ్యారు. ఐదు వారాలుగా శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణానికి అవసరమైన తలంబ్రాలను అత్యంత భక్తిశ్రద్ధలతో గోటితో ఒలిచి సిద్ధం చేశారు. ఈమేరకు సుమారు 50 మంది కాకర్ల శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆర్టీసీ బస్సులో భద్రాచలంకు తరలివెళ్లారు.



గోటి తలంబ్రాలతో వెళ్తున్న భక్తులు

అన్ని రంగాల్లో సముచిత స్థానం దక్కాలి



పాల్వంచ: మాట్లాడుతున్న భానుమతి



కొత్తగూడెంరూరల్: మహిళలకు సన్మానం..

పాల్వంచ: మహిళలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం దక్కాలని, అప్పుడు అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి అన్నారు. మంగళవారం పట్టణంలోని బొల్లేరుగూడెం నందు గల కాంట్రాక్టర్స్ అసోసియేషన్ హాల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భానుమతి మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పిల్లలను విలువలతో కూడిన విద్య విధానాన్ని నేర్పించాలన్నారు. న్యాయమూర్తి బి.రామారావు మాట్లాడుతూ... మహిళలు వంటింటికి పరిమితం కాకుండా విభిన్న రంగాల్లో రాణించి, ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనుబ్రోలు రాంప్రసాద్‌రావు, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వి.పురుషోత్తమరావు, లీగల్ సర్వీసెస్ సభ్యులు తోట మల్లేశ్వరరావు, మెండు రాజమల్లు, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ నాగ ప్రవంతి, జ్యోతి, పారా లీగల్ వాలంటీర్స్ రాజమణి, అనురాధ, కిశోర్, మహిళలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సన్మానం

కొత్తగూడెంరూరల్: మహిళ దినోత్సవం సందర్భంగా సమాజంలో విద్య, వైద్యం, పారిశుద్ధ్యం విభాగాలకు చెందిన మహిళలను జిల్లా కేంద్రంలోని ఎస్టీ హాస్టల్‌లో గాంధీపథం అధ్యక్షుడు చింతల చెర్వు గెర్షెమ్ ఆధ్వర్యంలో సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్ సుశీల వర్ధనరావు, స్టాఫ్‌నర్సు పూర్ణ చందర్‌రావు, హాస్టల్ సూపరింటెండెంట్ లలిత, దయామణి, భూషణం, జ్ఞాన వినోదిని , భానుమతి, లారెన్స్ పాల్గొన్నారు.

‘కలర్’ఫుల్ జోష్..



ఇల్లెందురూరల్: హోలీ వేడుకల్లో రంగులు పూసుకుని నృత్యం చేస్తున్న మహిళలు, యువత



రంగు పూసుకుంటున్న బుడతలు

వైభవంగా రంగుల కేళీ.. హోలీ వేడుకలు

రంగుల కేళీ హోలీ వేడుకలు మంగళవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అన్ని గ్రామాల్లో ఉదయం నుంచే వయోభేదం లేకుండా చిన్నా, పెద్దా అందరూ కలిసి రంగులు చల్లుకుంటూ, ఆనందోత్సాహాలతో సందడి చేశారు. రోడ్లపై ఆటపాటలతో నృత్యం చేశారు. పలు చోట్ల కామునిదహనం నిర్వహించారు. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



ఇల్లెందు: రంగులతో మహిళలు



పాల్వంచ: ఆశ్రమ గిరిజన హాస్టల్‌లో విద్యార్థుల కేరింతలు



టేకులపల్లి సెంటర్‌లో..



సింగరేణి(కొత్తగూడెం): మున్సిపల్ చైర్మన్ సీతాలక్ష్మికి రంగుపూస్తున్న మున్సిపల్ సిబ్బంది



చుంచుపల్లి: కొత్తగూడెం పట్టణంలో..



విద్యానగర్‌లో..



సుజాతనగర్‌లో..



జూలూరుపాడు: భోజ్యాతండాలో..



పాల్వంచరూరల్: రంగాపురంలో..



పాల్వంచ: మార్కెట్ ఏరియాలో కాముని దహనంలో మార్వాడీలు, వ్యాపారులు..